సాక్షి కుమురం భీం

శుక్రవారం । 9 । జూన్ । 2023



మధ్యాహ్నం ఆకలి తీర్చండి..!
జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు కావడం లేదు. మంచిర్యాల జిల్లా పర్యటనలో సీఎం స్పష్టతనిస్తారని విద్యార్థులు ఆశిస్తున్నారు. 8లో▸



పని చేసేవారికే 'ఉపాధి'
ఉపాధి హామీ పథకంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శ్రమించే కూలీలకే పనుల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42.4 /31.3
ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం 11 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి 10 వరకు వేడి సెగలు ఉంటాయి.

న్యూస్‌రీల్

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన మార్చి 2026 వరకు పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారి సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్‌వైజర్ 2, కేస్ వర్కర్స్ 1, కౌన్సిలర్ 1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన వారు https://asifabad. telangana. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తు ఫాంతోపాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జత చేసి శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లా కేంద్రంలోని మహిళా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

నిబంధనల మేరకు సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనల మేరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని డీఐఈవో శ్రీధర్‌సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో పరీక్ష నిర్వహణ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. జిల్లాలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు 8 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీటిని అందుబాటులో ఉంచాలని, ఫ్యాన్లు, లైట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బార్ కోడ్ స్కానింగ్ కోసం మొబైల్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 2,135 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరం పరిష్కారమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కేవీ రమేశ్ అన్నారు. ఈ నెల 10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై స్థానిక జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యువరాజుతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ ఇరువర్గాలు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ వేదికగా నిలుస్తుందన్నారు. కోర్టుల్లో సమయం వృథా కాకుండా ఆర్థికనష్టం లేకుండా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పేదలకు న్యాయ సహాయం కోసం ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా న్యాయవాదులు, పోలీసులు చొరవ చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,066 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

నకిలీ నోట్ల కేసు కంచికి!?

- స్టేషన్ బెయిల్‌తోనే సరిపెట్టిన వైనం
- నెలన్నర రోజులుగా వాంకిడిలో చర్చ
- నిందితుడికి వత్తాసు పలుకుతున్న పోలీసులు?
- రూ.15 లక్షలు చేతులు మారినట్లుగా ప్రచారం



వాంకిడిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ (ఫైల్)

సాక్షి, ఆసిఫాబాద్: ఏప్రిల్ 24.. వాంకిడి పోలీసులు నకిలీ కరెన్సీ నోట్లు కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.21.30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి వెంటనే తనకు బాగా తెలిసిన ఓ మిత్రుడి ద్వారా ఆసిఫాబాద్‌లోకి ఓ వ్యక్తికి కబురు పంపాడు. 'ఈ కేసు నుంచి నిందితుడిని తప్పించినా.. లేదా కేసు తీవ్రతను తగ్గించినా.. రూ.15 లక్షలు ఇస్తాడు' అన్నది కబురు సారాంశం. మళ్లీ కొన్ని గంటల తర్వాత అదే వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి.. 'భయ్యా.. మీరు సాయం చేయాల్సిన పనిలేదు. ఇక్కడే డీల్ కుదిరిందట' అని పేర్కొన్నట్లు ప్రచారం జరిగింది. రెండు, మూడు రోజులపాటు జిల్లాలోనూ ఈ కేసుపై బాగా చర్చ జరిగింది. వాంకిడి పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పోలీసులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచారం నిజమే కాబోలు అని స్థానికులు సైతం గుసగుసలాడుకుంటున్నారు. అందుకే ఈ కేసు కంచికి చేరిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ముఠాతో చేతులు కలిపి..

వాంకిడి మండల కేంద్రానికి చెందిన హిప్రే తిరుపతిది రైతు కుటుంబం. మంచి భూస్వామి. వ్యవసాయమే అతని ఆధారం. ఇతర వ్యాపారాలు ఏమీ లేవు. కొన్నేళ్ల క్రితం మహా రాష్ట్రకు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా నకిలీ నోట్ల వ్యాపారం చేసే ముఠాతో తిరుపతి చేతులు కలిపి.. కరెన్సీ మార్పిడికి శ్రీకారం చుట్టాడు. తరచూ నకిలీ నోట్లు వాంకిడికి అక్రమంగా తెప్పించుకుంటూ వాటిని అమాయకులకు కట్టబెట్టడం ద్వారా బాగానే ఆర్జించినట్లు సమాచారం. కొంత కాలంగా తిరుపతి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు ఏప్రిల్ 24 రాత్రి నకిలీ కరెన్సీ నోట్లు తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నెలన్నర గడిచినా కొలిక్కిరాని దర్యాప్తు..

నకిలీ కరెన్సీ చలామణికి యత్నించిన తిరుపతిని అరెస్టు చేసిన పోలీసులు అతన్ని పూర్తిస్థాయిలో విచారించలేదని సమాచారం. ఎందుకంటే స్టేషన్ బెయిల్ కేసుతో బయటపడిన తిరుపతి.. ఆ తర్వాత వాంకిడిలో దర్జాగా తిరుగుతున్నాడు. మహారాష్ట్రకు చెందిన ముఠా సభ్యులను కానీ.. తిరుపతికి పరిచయం ఉన్న వ్యక్తిని కానీ.. ఇంతవరకు పోలీసులు అరెస్టు చేయనేలేదు. పైగా నిందితుడు తిరుపతి నకిలీ నోట్ల ముఠా సభ్యుల చేతిలో మోసపోయినట్లుగా వాంకిడి పోలీసులు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు విషయమై 'సాక్షి' వాంకిడి సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. నకిలీ కరెన్సీ నోట్ల కేసును లోతుగా దర్యాప్తులో చేస్తున్నామని, కేసు ఛేదించేందుకే నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చామని తెలిపారు.

ఐపీసీ సెక్షన్ 489(సి)తో సరిపెట్టారు

ఏప్రిల్‌లో నకిలీ నోట్ల చలామణి చేసే ముఠాకు తిరుపతి రూ.10 లక్షలు(అసలైన కరెన్సీ) ఇచ్చాడు. అందుకు గాను రూ.21.30 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు ఆదిలాబాద్‌లోని ఆ ముఠా సభ్యుడి నుంచి తిరుపతికి అందజేసినట్లు తెలిసింది. వాటిని ఏప్రిల్ 24న వాంకిడికి తీసుకొచ్చిన తిరుపతి సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు సిద్ధమవుతుండగా.. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. తిరుపతి ఇచ్చిన సమాచారం మేరకు ఇంట్లోని ఫ్రిజ్‌లో దాచిన రూ.21.30 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అతడిపై ఐపీసీ సెక్షన్ 489(సి) కేసు(ఏడేళ్లలోపు శిక్ష పడే ఐపీసీ సెక్షన్) నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా.. స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. వందలు, వేలు కాదు ఏకంగా లక్షలాది రూపాయల నకిలీ నోట్లు దొరికితే కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చే సెక్షన్‌తో కేసు నమోదు చేయడం వెనుక భారీగా ముడుపులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు రూ.15 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ పోలీసులు సైతం ముడుపుల వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు ఈ కేసు పూర్వపరాలు పంపినట్లు సమాచారం.

నేడు నస్పూర్‌కు కేసీఆర్



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

- సీఎం పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, పార్టీ కార్యాలయం, పథకాలు ప్రారంభం
- చెన్నూరు ఎత్తిపోతలతోపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నస్పూర్‌లో భారీ బహిరంగ సభ



కొత్త కలెక్టరేట్ ప్రారంభ వేదిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎం కేసీఆర్ మంచిర్యాల జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం నస్పూర్ రానున్న సీఎం కేసీఆర్ మొదట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, కలెక్టరేట్ ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బహిరంగ సభాస్థలికి వెళ్తారు. బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూతనిచ్చే రూ.లక్ష ఆర్థికసాయం పథకం, రెండో విడత దళితబంధు, స్థలం ఉండి, ఇల్లు కట్టుకునే వారికి రూ.3లక్షల సాయం అందించే గృహలక్ష్మి పథకం ప్రారంభిస్తారు. లబ్ధిదారులకు సీఎం చేతుల మీదుగా లాంఛనంగా చెక్కులు అందిస్తారు. దొనబండకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రూ.1658కోట్ల వ్యయంతో, లక్ష ఎకరాలకు సాగునీరందించే చెన్నూరు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. మందమర్రిలో రూ.500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీ, రూ.164కోట్లతో గోదావరి నదిపై నిర్మించనున్న మంచిర్యాల, అంతర్గాం రోడ్డు బ్రిడ్జి, హాజీపూర్ మండలం గుడిపేటలో రూ.205కోట్లతో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

భారీ బహిరంగ సభ

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి నస్పూర్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు రోడ్లు, డివైడర్ల వెంట భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గులాబీ జెండాలతో అలంకరించారు. నస్పూర్ పట్టణం కలెక్టరేట్ సమీపంలోనే 40ఎకరాల్లో సభకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. 200మంది కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల్లో సన్నాహక సభలతో కార్యకర్తలు, నాయకులు భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, కూల్ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, భోజనాలు సిద్ధం చేశారు. వేదిక ముందు కుర్చీలు, టెంట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్, భారీ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు.

రెండు వేల మందితో బందోబస్తు

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరుగురు డీసీపీ స్థాయి అధికారులు, 21మంది అడిషనల్ ఎస్పీలు, 62మంది సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పీసీలు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ, మహిళా పోలీసులతో మొత్తం 2,350మందితో బందోబస్తు సాగనుంది. మంచిర్యాల డీసీపీ రామ్‌నాథ్ కేకన్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ నేతృత్వంలో పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. అవాంఛనీయ ఘటనలు, ఆటంకాలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకున్నారు.

జూన్‌లోనూ భగభగలు



- రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదు
- కుంచవెల్లిలో 45.9, రవీంద్రనగర్‌లో 45.5 డిగ్రీలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లోనూ ఎండలు భగభగమంటున్నాయి. పగటిపూట వేడిగాలులతో ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రిపూట సైతం ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు చేరువలో నమోదవుతుండటంతో ఉక్కపోతలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూలర్లు, ఫ్యాన్లు లేకుండా క్షణం కూడా ఉండలేకపోతున్నారు. గురువారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలోనే ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉక్కపోత, వేడి గాలులతో వడదెబ్బ బారిన ప్రమాదం ఉండటంతో బయట తిరిగేవారు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

దహెగాం, చింతలమానెపల్లి మండలాలకు హెచ్చరిక

సాధారణంగా జూన్ మొదటి వారం తర్వాత నుంచి ఎండలు తగ్గుముఖం పడతాయి. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వేడి పరిస్థితులే కొనసాగుతున్నాయి. గురువారం జిల్లాలోని దహెగాం మండలంలోని కుంచవెల్లిలో గరిష్ట ఉష్ణోగ్రత 45.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. అలాగే చింతలమానెపల్లి మండలం రవీంద్రగనగర్‌లో 45.5 డిగ్రీలు.. కాగజ్‌నగర్ మండలం జంబుగాలో 44.5 డిగ్రీలుగా నమోదైంది. దహెగాం, చింతలమానెపల్లి మండలాలు రెడ్‌జోన్‌లో కొనసాగుతున్నాయి. అలాగే కాగజ్‌నగర్, కౌటాల, కెరమెరి, వాంకిడి మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం ప్రజలు బయటికి వచ్చేందుకు జంకుతుండటంతో రహదారులు నిర్మానుష్యంగా మారా యి. గురువారం రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.

'ముందస్తు' సాగు సాధ్యమేనా..?

- అకాల వర్షాలతో పంటలు దెబ్బతినకుండా అధికారుల కసరత్తు
- బోరుబావులు, నీటి లభ్యత ఉంటే ఇబ్బంది లేదంటున్న రైతులు
- సమృద్ధిగా వర్షాలు పడితేనే చెరువులు, కుంటల కింద వరినాట్లు
- ఈ ఏడాది ఆలస్యంగా రుతుపవనాల రాక..



వరినారు (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): వానాకాలం సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో ఏటా సాగు ఆలస్యమవుతోంది. అదును దాటిపోవడంతో పంటలు చేతికందే సమయంలో వాతావరణ మార్పులతో అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోంది. పంటలు చీడపీడల బారిన పడటంతోపాటు అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. వానాకాలం సాగు ఆలస్యమైతే దానికి అనుగుణంగా యాసంగి సాగు సైతం వెనక్కి జరుగుతోంది. జిల్లాలో జూన్ వచ్చినా యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మేలో కురిసిన అకాల వర్షాలకు చాలా మండలాల్లో పంటలు తీవ్రస్థాయిలో దెబ్బతినగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసి మొలకలు వచ్చాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు నెల రోజుల ముందే పంటల సాగు చేపట్టేలా వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.


దెబ్బతీసిన అకాల వర్షాలు..

జిల్లాలో సాధారణంగా వానాకాలం పంటల సాగు ఆగస్టు వరకు కొనసాగుతుంది. పత్తి, సోయా, కంది వంటి పంటలు జూలై మొదటి వారంతో ప్రారంభిస్తారు. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 58,770 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. పత్తి గరిష్టంగా 3.42 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఈ విస్తీర్ణం మరింత పెరగొచ్చు. వరి విషయానికొస్తే చెరువులు, కుంటల కింద రైతులు పూర్తిగా వర్షాధారంగానే సాగు చేస్తారు. సీజన్ ప్రారంభంలోనే విస్తారంగా వర్షాలు పడి, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటే జూలై మూడో వారం వరకు నాట్లు వేసుకుంటారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వర్షాలు ఇంకా పడలేదు. కొన్ని సంవత్సరాలుగా జూన్‌లో వర్షపాతం తక్కువగానే ఉంటుంది. ఆయకట్టు రైతులు చెరువులు, కుంటలు నిండే వరకు వేచి చూసిన తర్వాతే నారు పోసుకుంటారు. ఫలితంగా ఆగస్టు వరకు నాట్లు కొనసాగుతూనే ఉంటాయి. వానాకాలం సాగుకు అనుగుణంగా యాసంగిలో రైతులు నాట్లు వేసుకుంటున్నారు. దీంతో యాసంగి ధాన్యం చేతికందే సమయంలో ఏటా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

మృగశిర కార్తె ప్రారంభం..

గురువారం నుంచి మృగశిర కార్తె ప్రారంభమైంది. భారీ వర్షాలు లేకున్నా రైతులు సంప్రదాయబద్ధంగా సాగు పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది విత్తనాలు కొనుగోలు చేశారు. ముందస్తు సాగును ప్రోత్సహించేలా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి సాగుకు 14,695 క్వింటాళ్ల విత్తనాలు, పత్తికి 6,84,000 విత్తన ప్యాకెట్లతోపాటు యూరియా 45,060 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11,265.39, ఎంవోపీ 4,053.01, కాంప్లెక్స్ ఎరువులు 22,538.03, ఎస్ఎస్‌పీ 3,000 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ముందస్తు సాగుపై రైతుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. విత్తనాలు వేసుకున్న తర్వాత సీజన్ ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా పడకుంటే పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు. బోరుబావుల కింద, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ముందస్తు వరినాట్లు సాధ్యమవుతుందని వారు చెబుతున్నారు.

నష్టం తగ్గుతుంది



ముందస్తు వరి సాగుతో రైతులకు అకాల వర్షాల కంటే ముందే పంట చేతికందుతుంది. దీని ద్వారా నష్టం తగ్గుతుంది. జూన్‌లోనే వీలయినంత తొందరగా నాట్లు వేస్తే సెప్టెంబర్‌లో పంట చేతికొస్తుంది. ఆపై యాసంగి సాగు చేపడితే అకాల వర్షాల ముప్పు ఉండదు. ముందస్తు సాగుకు అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించడంతోపాటు సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.
– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

చెరువులతోనే వ్యవసాయ రంగం అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- అడ ప్రాజెక్టు వద్ద ఘనంగా 'చెరువుల పండుగ'
- హాజరైన కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే సక్కు



ప్రాజెక్టు వద్ద కొబ్బరికాయ కొడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, పక్కన కలెక్టర్, తదితరులు



బతుకమ్మలతో ర్యాలీగా వస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: చెరువులతోనే వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం(అడ) ప్రాజెక్టు వద్ద ఊరూరా చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే సక్కుతో కలిసి ఆమె హాజరయ్యారు. అంతకు ముందు వలలతో మత్స్యకారులు, బతుకమ్మలు, బోనాలు ఎత్తుకున్న మహిళలతో కలిసి ప్రాజెక్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్టు వద్ద బతుకమ్మ ఆడిపాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. జిల్లాలో బీడు భూములకు సాగునీరందడంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం విజయవంతమైందన్నారు. సాగునీటి రంగంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే సక్కు అన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి సబ్సిడీపై వలలు, ద్విచక్ర వాహనాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, తహసీల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- డీఈవో అశోక్



అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో అశోక్

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రభుత్వ బడుల్లో ఉచితంగా నాణ్యమైన విద్యనందిస్తున్నామని డీఈవో అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని అర్జుగూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరై ఒకటో తరగతి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందజేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సౌకర్యాలు ఉన్న సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు ఆవిష్కరించారు. పాఠశాల నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల అవశ్యకతను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాథోడ్ సుభాష్, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జగదీష్, సీఆర్పీలు దుర్గం సందీప్, సునీల్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

జన్నారం(ఖానాపూర్): ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తానాజీనాయక్ తెలిపారు. జన్నారంకు చెందిన మహ్మద్ మునీర్‌కు ఇదివరకే వివాహంకాగా అతని భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాలిక (17) పరిచయం పెంచుకున్నాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఏడాదిన్నరకాలంగా శారీరకంగా వాడుకున్నాడు. ఈ నెల 6 తనను ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని మునీర్‌ను నిలదీయడంతో వివాహానికి నిరాకరించాడు. దిక్కున్నచోట చెప్పుకొమ్మని, మరోసారి పెళ్లి గురించి మాట్లాడితే చంపుతానని బెదిరించాడు. విషయాన్ని ఇంట్లో చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై తానాజీ నాయక్ విచారణ జరిపి మునీర్‌పై పోక్సోయాక్టు కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

మార్కులు తక్కువ వస్తాయేమోనని ...

- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య
- నాలుగు రోజుల క్రితం ఘటన


రాథోడ్ సచిన్ (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): పరీక్షలో మార్కులు తక్కువగా వస్తాయేమోనని బెంగతో విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలంలోని అనార్‌పల్లికి చెందిన రాథోడ్ దత్తారాం, కవితాబాయి దంపతులకు కుమారుడు సచిన్ (19), కూతురు ఉన్నారు. సచిన్ ఆర్నెళ్లుగా ఉట్నూర్‌లోని ఓ ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో జేఈఈ కోచింగ్ తీసుకున్నాడు. పరీక్ష రాసేందుకు శనివారం రాత్రి ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు ట్రావెల్స్‌లో బయలుదేరాడు. ఈ నెల 4న (ఆదివారం) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జరిగిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు హాజరయ్యాడు. ఆదివారం సాయంత్రం దత్తారాం కుమారుడితో మాట్లాడగా సోమవారం ఉదయం ఇంటికి వస్తానని చెప్పాడు. అదేరోజు రాత్రి ఎల్బీనగర్ సమీపంలో లోకల్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న బంధువులకు విషయం తెలియడంతో ఎల్బీనగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లగా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియడంతో బోరున విలపించారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


సంఘటన స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన టెంకె కిషన్ (38) వ్యవసాయ కూలీ. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మద్యం సేవించి ఇంటికి వచ్చి అన్నంతిని పడుకున్నాడు. గురువారం తెల్లవారుజామున బయటికి వెళ్లి గ్రామ సమీపంలోని సవారి బంగ్లా వద్ద గల మర్రిచెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య నానుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

మధ్యాహ్నం ఆకలి తీర్చండి..!

- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఆశలు
- సీఎం పర్యటన నేపథ్యంలో విద్యార్థుల ఎదురుచూపులు



మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈ నెల 1 నుంచి పునఃప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇప్పుడిప్పుడే కళాశాల బాటపడుతున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలపై అధ్యాపకులు దృష్టి సారించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రాల ద్వారా అధ్యాపకులు విస్తత ప్రచారం చేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే కళాశాలల్లో డ్రాపౌట్స్ నివారించటంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్నం భోజనం అమలుకు నిర్ణయించినట్లు జూలై 18, 2020న ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. కరోనా నేపథ్యంలో ఈ పథకం అమలుకు నోచుకోలేదు. గతేడాది అయినా అమలు చేస్తారని ఎదురుచూసిన విద్యార్థులకు నిరాశ తప్పలేదు. 2023–24 విద్యాసంవత్సరంలో జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమైనా మధ్యాహ్నం భోజనం అమలుపై సందిగ్ధం తొలగలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఇప్పుడైనా మధ్యాహ్న భోజనం అమలు ప్రకటనపై క్లారిటీ వస్తుందని విద్యార్థులు గంపెడాశతో ఉన్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, గురుకులాలు, మోడల్, కేజీబీవీలు కలిపి 53 కళాశాలలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని మొత్తం 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆయా కళాశాలలకు వస్తుంటారు. ఉదయం 9.30 గంటల వరకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు కళాశాలలకు వెళ్లాలంటే ఇంటి నుంచి సుమారు 8 గంటలకే బయలుదేరాలి. పేద విద్యార్థుల ఇళ్లల్లో ఉదయం పూట సమయానికి వంట కాకపోవటంతో ఒక్కోసారి అల్పాహారం తీసుకోకుండానే కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో అర్ధాకలితో ఉన్న విద్యార్థులకు తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠాలు అర్థంకాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మందకొడిగా ప్రవేశాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు మందకొడిగా సాగుతున్నాయి. కళాశాలలు ప్రారంభమై ఎనిమిది రోజులు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కళాశాలల్లో పదుల సంఖ్యలో కూడా అడ్మిషన్లు కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు ఆదర్శ కళాశాలలు, కేజీబీవీల సంఖ్య ఎక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు వసతిగృహాలు ఉన్న కళాశాలల్లోనే చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600 మంది ప్రవేశాలు పొందితే కేవలం వసతి సౌకర్యం లేకపోవటంతో 200 మంది విద్యార్థులు వెనక్కి వెళ్లిపోయారని ఓ అధికారి తెలిపారు. కనీసం మధ్యాహ్న భోజనం అమలు చేస్తే కొంతమేర అయినా విద్యార్థులకు సౌకర్యంగా మారి ప్రవేశాల సంఖ్య ఊపందుకునే అవకాశాలుంటాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'మధ్యాహ్నం'తో విద్యార్థులకు మేలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రవేశాల సంఖ్య కూడా పెరుగుతుంది. విద్యార్థులు రెండు పూటలా తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

రాష్ట్రస్థాయి చెస్‌పోటీలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కోట సుధాకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నేటి నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలను విజయవంతం చేయాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్ అన్నారు. గురువారం పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రాజు శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగె ఉపేందర్, కోశాధికారి కుమ్మరి మల్లేశ్, సంయుక్త కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, ఎం.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మినీ లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సునీల్ మాదిగ

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో ఏర్పాటు చేయనున్న మినీ లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ పార్క్ పేరిట 2003లో సింగరేణి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించగా ప్రభుత్వం సబ్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం సుమారు వెయ్యి మందికి శిక్షణ కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. పార్క్ ప్రారంభిస్తే వేలాది మందికి ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యటనలో భాగంగా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి రమేశ్, నాయకులు విజయ్‌కుమార్, కుమార్, సమ్మయ్య, రాజేశ్, భీమయ్య, రాఘవులు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా తూనికలు కొలతలశాఖ అధికారి విశ్వేశ్వర్


చేపల మార్కెట్‌లో కాంటా పరిశీలిస్తున్న అధికారి

పాతమంచిర్యాల: వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు కొలతలశాఖ అధికారి కే.విశ్వేశ్వర్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్, సీసీసీ, ఏసీసీ, లక్ష్మీ థియేటర్ ఏరియాల్లోని చేపల మార్కెట్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల రాళ్లు, కాంటాలపై ముద్రలు లేకుండా తూకం వేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కొంత మంది వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు తమదృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా 25 దుకాణాలు తనిఖీ చేసి ముద్రలు లేకుండా విక్రయాలు సాగిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాం


సీతారామయ్యను సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ద్వారా మెరుగైన వేతన ఒప్పందం సాధించామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, శాశ్వత వేజ్‌బోర్డు సభ్యుడు సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రెండేళ్ల కాలం వృథా అయ్యిందన్నారు. పది సార్లు సమావేశం జరిగినా ఐదుసార్లు వాయిదా పడిందన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్యను ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, నాయకులు బియ్యాల వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, రవీందర్, నాగేశ్వరరావు, శ్రీహరి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న మంచిర్యాలలోని జెడ్పీ బాలుర మైదానంలో బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నివాస్‌గౌడ్, ఎం. శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 జిల్లా జట్టు ఎంపిక, అండర్–14, అండర్–12 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రాలతో రిపోర్టు చేయాలని, ఇతర వివరాలకు 9963539234 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఓబీ లక్ష్యాలు సాధించాలి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో నిర్దేశించిన ఓవర్ బర్డెన్ (మట్టి వెలికితీత) లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్లు పేర్కొన్నారు. కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్ (ఆపరేషన్) వెంకటేశ్వర్ రెడ్డి(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) గురువారం ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ నుంచి ఏరియా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ ఏరియాలోని రెండు ఓసీపీల్లో నిర్దేశించిన ఓబీ లక్ష్యాన్ని సాధించడానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఓపెన్ కాస్ట్ గని ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఓసీపీ ఓబీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి అధికారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంవోఏఐ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి దేవేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నస్పూర్‌కు వస్తున్న నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. కంపెనీలో ఉద్యోగుల పిల్లలకు ఇస్తున్నట్లుగా ఐఐటీ ఐఐఎంలో చదువుతున్న అధికారుల పిల్లలకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని, కంపెనీ క్వార్టర్లకు ఉచిత విద్యుత్ అందించాలని, 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఆర్‌పీ మొత్తాలను చెల్లించాలని కోరారు. అంతేకాకుండా అధికారులకు ప్రతీ నాలుగేళ్లకోసారి ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయాలని కోరారు.

కుల, చేతివృత్తులకు రూ.లక్ష సాయం

మంచిర్యాలటౌన్: కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించే పథకాన్ని శుక్రవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవాలని, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు ఉండాలన్నారు. https:// tsobmmsbc. cgg. gov. in వెబ్‌సైట్‌లో ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, కులం, ఆదాయ ధృవపత్రం 2023, నివాస ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీఎం ఎన్టీఆర్‌నగర్‌ను సందర్శించాలి


మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: గతేడాది కురిసిన వర్షాలు, వరదలతో మునిగిపోయిన ఎన్టీఆర్‌నగర్ కాలనీ ముంపు ప్రాంతాన్ని సీఎం కేసీఆర్ సందర్శించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్ధన్, తుల ఆంజనేయులు, అమిరిశెట్టి రాజు, కంకణాల సతీశ్, రంగ శ్రీశైలం, రాకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్


మాట్లాడుతున్న వెంకట్రావ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఉద్యోగులంతా నేడు నస్పూర్‌లో జరుగనున్న సీఎం కేసీఆర్ బహిరంగసభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావ్ కోరారు. గురువారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ఏ ముఖ్యమంత్రి కార్మికులకు చేయనంతా మేలు కేసీఆర్ చేశారన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్‌ను తిరిగి కారుణ్య ఉద్యోగాల పేరుతో పునరుద్ధరించారన్నారు. సమావేశంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, చర్చల ప్రతినిధులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, కాశీరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. 2018లో ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, అన్ని హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సింగరేణిలో 26 వేలమంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, లాభాల్లో వాటా చెల్లించాలని, కార్మికులు చనిపోతే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కేసీఆర్ నస్పూర్‌కు వస్తున్న సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్పందించి కంపెనీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు అఫ్రోజ్‌ఖాన్, శ్యామ్, సంతోష్, వెంకటేశ్, శైలజ, రాజేశ్వరి, శంకర్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి



నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

రామకృష్ణాపూర్(చెన్నూర్): భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి చెందింది. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గంగాకాలనీలో నివాసముండే అన్నేడి లచ్చిరెడ్డి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. పదేళ్లక్రితమే ఉద్యోగ విరమణ పొందగా వచ్చిన డబ్బులన్నీ అతని భార్య మల్లవ్వకు అప్పగించాడు. పెన్షన్‌తో పాటు భూమి కౌలుడబ్బులు కూడా ఆమెకే ఇచ్చేవాడు. అయితే తన వ్యక్తిగత అవసరాలకు డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో తరచూ వారిమధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో పథకం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అతని భార్య మల్లవ్వను ఇంట్లోనే గొడ్డలితో మెడపై నరికాడు. కోడలు మంజుల కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిందితుడు లచ్చిరెడ్డిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో పట్టణ ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

చెన్నూర్ డివిజన్ కల నెరవేరేనా?

- ముఖ్యమంత్రి రాకతో చిగురిస్తున్న ఆశలు
- రెవెన్యూ డివిజన్ ఏర్పడితే ప్రజలకు మేలు



అధికారులు తయారు చేసిన పారుపల్లి మండల మ్యాప్

చెన్నూర్: జిల్లాకు ముఖ్యమంత్రి రాకతో చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తానని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ హామీ ఇచ్చారు. 2019లో రెవెన్యూ డివిజన్‌తో పాటు కొత్త మండలాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేశారు. మండలాల విభజన ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఫైల్ ముఖ్యమంత్రి వద్ద ఉంది. శుక్రవారం సీఎం జిల్లా పర్యటనలో చెన్నూర్ ప్రాంతవాసుల చిరకాల వాంఛ నేరవేరుస్తారని గంపెడాశతో ఉన్నారు.

ఈ ప్రాంత ప్రజలకు మేలు

నియోజకవర్గంలో చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీలతో పాటు ఐదు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు భూ సమస్యల పరిష్కరం కోసం మంచిర్యాలలోని రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే 80 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. దూరభారంతో పాటు ఆర్థిక భారం పడి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రెవెన్యూ డివిజన్ అనివార్యం. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల కొంత జాప్యం జరిగింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రెవెన్యూ డివిజన్, రెండు కొత్త మండలాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సదరం శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: ఈ నెల 14 నుంచి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. 14న శారీరక వికలాంగులు, కంటి చూపు సమస్యలున్నవారికి, 22న మూగ, చెవుడు, మానసిక వికలాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

నస్పూర్(మంచిర్యాల): ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 2,241 మంది ఉన్నతాధికారులు, అధికారులు, ఇతర సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి పోలీసులు నస్పూర్ పట్టణానికి చేరుకున్నారు. నలుగురు ఎస్పీలు, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 18 మంది ఏసీపీ/డీసీపీలు, 62 మంది సీఐలు, 182 మంది ఎస్సై, ఆర్ఎస్సైలు, రోప్ టీంలు, స్పెషల్, ఆర్మ్‌డ్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, డ్రైవర్లు, తదితర సిబ్బంది సీఎం భద్రతా ఏర్పాట్లలో పాల్గొననున్నారు.

ఏర్పాట్లు పూర్తి

పట్టణంలో నేడు సీఎం కేసీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సమీకృత కలెక్టరేట్ భవనం ఆవరణలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. సీఎం బహిరంగసభ వద్ద వేదిక పనులు పూర్తయ్యాయి. వీఐపీ, ప్రెస్, తదితర గ్యాలరీలు, పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణం బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలతో గులాబీమయం అయ్యింది. నాయకులు జన సమీకరణకు కావాల్సిన వాహనాలు సమకూర్చుకుంటున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

గోదావరిఖని, చెన్నూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే వాహనదారులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గల జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా క్యాతన్‌పల్లి గాంధారి వనం నుంచి మంచిర్యాలకు చేరుకోవాలి. మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్, చెన్నూర్, గోదావరిఖనికి వెళ్లే వాహనదారులు క్యాతన్‌పల్లి గాంధారి వనం వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్దగల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సీఎం పర్యటన ముగిసే వరకూ ఈ ఆంక్షలు ఉంటాయని, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.